క్లుప్తంగా

కొండగట్టులో మేడిపెల్లి సత్యం పూజలు



ఆలయంలో మేడిపెల్లి సత్యం పూజలు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారిని శనివారం చొప్పదండి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపెల్లి సత్యం దర్శించుకుని పూజలు నిర్వహించారు.నేడు ఎన్నికల తీర్పు వెలువడుతున్న నేపథ్యంలో స్వామి వారి దయతో భారీ మెజారిటీతో గెలుపొంది, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నట్లు సాక్షికి తెలిపారు. ఆయన వెంట నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్,ముత్యం శంకర్,గాజుల అజయ్ తదితరులు ఉన్నారు.

బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా పోటీలకు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

జగిత్యాలరూరల్: డిసెంబర్ 5న జరిగే ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలకు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల పీఈటీ అజయ్‌బాబు తెలిపారు. నవంబర్‌లో జరిగిన జగిత్యాల జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో అండర్ -14, అండర్ -17ల్లో సాహితి, శరణ్య, పూజ, రాహుల్, హర్షవర్ధన్ అత్యంత ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాల హెచ్‌ఎం సత్తయ్య, సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆది శ్రీనివాస్‌ను కలిసిన మండల నాయకులు



ఆది శ్రీనివాస్‌తో కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: వేములవాడలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను కథలాపూర్ మండల పార్టీ నాయకులు శనివారం కలిశారు. మండలంలోని భూషణరావుపేట, చింతకుంట, బొమ్మెన గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామాల వారీగా పోలింగ్ సరళిని వివరించారు. పలు గ్రామాల్లో ఇతర పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వద్ద గందరగోళంగా వ్యవహరించినప్పటికీ ధీటుగా సమాధానమిచ్చామని ఆయా గ్రామాల నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూన శ్రీనివాస్, వాకిటి రాజారెడ్డి, స్వామిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, చిన్నారెడ్డి, జలందర్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక

కథలాపూర్: గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శనివారం కథలాపూర్ మండల కేంద్రంలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు.

13 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ

కథలాపూర్: మండలం సిరికొండ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో 13,746 క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు చైర్మన్ చుక్క దేవరాజం శనివారం తెలిపారు. మండలంలోని సిరికొండ కొనుగోలు కేంద్రంలో 92 మంది రైతుల వద్ద 6,290 క్వింటాళ్లు, తక్కళ్లపెల్లిలో 82 మంది రైతుల వద్ద 7,456 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులు రాక అవస్థలు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, వ్యాపారులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ప్రయాణికులపై ఆర్థిక భారం



బస్సులు లేక ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణిస్తున్న విద్యార్థులు

కథలాపూర్: ప్రయాణికులను గమ్యం చేర్చడమే ఆర్టీసీ లక్ష్యమని పాలకులు, అధికారులు పేర్కొంటున్నా.. ఆచరణలో మాత్రం అమలు కావడంలేదు. ప్రజా అవసరాలను విస్మరించి ఆదాయం రావడం లేదనే సాకుతో గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సుల ట్రిప్పులు కుదించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు రాక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

మండల కేంద్రం నుంచి 8 రూట్లలో బస్సులు..

కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు కథలాపూర్ మీదుగా సుమారు 8 రూట్లలో నడుస్తున్నాయి. మండల ప్రజలు వివిధ అవసరాలకు సమీపంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు వెళ్లి వస్తుంటారు. కోరుట్ల–వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండల కేంద్రం ఉండటంతో బస్సులన్నీ కథలాపూర్ మీదుగా వెళ్తాయి. ఆర్టీసీ బస్సులను ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. కోరుట్ల– వేములవాడ రూట్‌లో ప్రతిరోజు యథావిధిగా బస్సులు నడిపిస్తున్న అధికారులు.. గ్రామాలకు వెళ్లే బస్సులను కొన్ని ట్రిప్పులు రద్దు చేశారు. దీంతో మండల ప్రజలు వివిధ గ్రామాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడానికి, వ్యాపారులు పట్టణాల్లో వస్తువులు కొనుగోలు చేసి స్వగ్రామాలకు రావడానికి ఇక్కట్లపాలవుతున్నారు.

ఇబ్బంది పడుతున్న గ్రామాలు ఇవే..

కథలాపూర్ మండలం దూలూర్, చింతకుంట, భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పెల్లి, కోనాపూర్ గ్రామాలకు ఉదయం వేళ పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. తుర్తి, పోతారం, ఇప్పపెల్లి గ్రామాలకు సరైన సమయంలో బస్సులు రావడంలేదని స్థానికులు తెలిపారు. ఇదే అదునుగా భావించి ప్రైవేట్ ఆటోలు, జీపులు చార్జీలు ఇష్టమొచ్చినట్లు వసూళ్లు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ అవసరాలకు వేరే గ్రామాలకు వెళ్లితే గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షిస్తున్నాన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటికి చేరడానికి అష్టకష్టాలు పడాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, పాల వ్యాపారులు ప్రైవేట్ వాహనాలకు అధిక ఛార్జీలు



ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

చెల్లించలేక ఇళ్లలోనే ఉండిపోతున్నట్లు వారు తెలిపారు. బస్సుల సౌకర్యం గురించి ఆయా గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా స్పందన కరువైందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి గ్రామాలకు యథావిధిగా బస్సు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులపై ఆర్థిక భారం



గ్రామాలకు ఆర్టీసీ బస్సులు సరైన సమయంలో రాకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో కోరుట్ల, కథలాపూర్‌కు చేరుకుంటున్నారు. రాయితీ బస్ పాసులకు విద్యార్థులు నెలకు రూ. 300 నుంచి 400 చెల్లిస్తే సరిపోయేది. ప్రైవేట్ వాహనాల్లో విద్యార్థులు వెళ్లడానికి నెలకు కనీసం రూ. 2,500 వెచ్చిస్తున్నారు. ప్రభుత్వ సంస్థ కూడా ప్రజా అవసరాలను విస్మరించడం సరికాదు.

– బాదినేని రమేశ్, ఎంపీటీసీ, పెగ్గెర్ల

ప్రతీ రోజు బైకుపై తీసుకెళ్తున్న



గ్రామంలో ఉన్నత చదువుల పాఠశాల లేకపోవడంతో మా పిల్లలు కథలాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. బస్సు సౌకర్యం లేక ప్రతీరోజు ఉదయం, సాయంత్రం బైక్‌పై తీసుకెళ్తున్న. గ్రామాలకు సరైన సమయంలో బస్సు సౌకర్యం కల్పించకపోవడం దారుణం. పాలకులు కూడా గ్రామాలకు బస్సులు రాకపోతే పట్టించుకోవడంలేదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బస్సులు నడిపించాలి.

– బాస శ్రీనివాస్, దూలూర్

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

ప్రజలకు ఆర్టీసీ సేవలను అందించాలని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు ప్రయాణించాలి. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న గ్రామాల ప్రజాప్రతినిధులు బస్సుల కోసం, ఏ సమయంలో అవసరమో వినతిపత్రాలు ఇస్తే పరిశీలించి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

– విజయ మాధురి, డీఎం, కోరుట్ల

తేమ శాతం రాగానే ధాన్యం కొనుగోలు చేస్తాం



పొలాసలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం

జగిత్యాలరూరల్: తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేస్తామని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం పొలాస, వెల్దుర్తి, నర్సింగాపూర్, అంతర్గాం, కల్లెడ, జాబితాపూర్, ధర్మారం, మోతె గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తాము తెచ్చే ధాన్యాన్ని తేమ శాతం చూసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. వెంటనే కొనుగోలు చేస్తామన్నారు. రైతులు, అధికారుల సహకారంతో జగిత్యాల రూరల్ మండలంలో 15 కొనుగోలు కేంద్రాల్లో 69,556 క్వింటాళ్లు, అర్బన్ మండలంలోని 5 కేంద్రాల ద్వారా 15,570 క్వింటాళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు వంజరిపల్లి, అంతర్గాం కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు మరియ, రవీందర్, మంగ, గంగారాం, విద్యాసాగర్, వీవోఏ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువైద్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పెగడపల్లి: మండలంలో పశువైద్య ఉప కేంద్రాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు. మండలంలో ఎక్కడ కూడా ఉప కేంద్రాలు లేక పోవడంతో మారుమూల గ్రామాల్లోని పశువులకు పశువైద్యం అందని ద్రాక్షగా మారింది. మండలంలో 23 గ్రామాలుండగా మండల కేంద్రంలో ప్రధాన పశువైద్య కేంద్రం ఉంది. మారుమూల గ్రామాల పశువులకు సకాలంలో వైద్యం అందేలా పలు గ్రామాల్లో పశువైద్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు, పాలకులు తీర్మానాలు చే శారే కానీ ర్పాటులో అధికారులు శ్రద్ధ చూపడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఉప కేంద్రాలు లేక పోవడంతో వ్యాధుల బారిన పడుతున్న పశువులకు వైద్యం అందాలంటే మండల కేంద్రంలో ఉన్న పశువైద్య కేంద్రానికి రావాల్సిందే. మండల కేంద్రానికి రావాలంటే దూర భారం అధిక ఉండటంతో సకాలంలో పశువులకు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉప కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పశువైద్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి మారుమూల గ్రామాల్లో ఉన్న పశువులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పేదల కోసం సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తాం



సరుకులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: పేదల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల అంజనేయులు అన్నారు. పట్టణానికి చెందిన స్వాతి అనే పేదింటి యువతికి శనివారం క్లబ్ తరఫున నిత్యావసర సరుకులతో పాటు రూ.5వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ మెట్‌పల్లి లయన్స్ క్లబ్ జిల్లాలో ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఇల్లెందుల శ్రీధర్, వెంకటేశ్వర్లు, పోలీస్ శ్రీనివాస్, శ్రీకాంత్, తిరుమలాచారి తదితరులున్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

రాయికల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని యాకూబ్‌జీ అనే నిరుపేద కుటుంబానికి శనివారం రాయికల్‌కు చెందిన నాగరాజు, గౌతమి కుమారుడు శ్రీనిక్ జన్మదినం సందర్భంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు జగదీశ్వర్, సాయికుమార్, కిరణ్‌రావు, ముత్యం రాజిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. సమావేశానికి ఎంపీటీసీలు పానకంటి వెంకట్, తిమ్మణి రాములు, డబ్బా సర్పంచ్ గంగాధర్ మాత్రమే హాజరు కావడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. సమావేశంలో మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, ఏఈలు అరుణ, సుకన్య, ఫారెస్ట్ బీట్ అధికారి రత్నకర్, ఆర్టీసీ అధికారి మాత్రమే హాజరయ్యారు.

కోటేశ్వరస్వామి ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



జెడ్పీ చైర్‌పర్సన్‌ను దీవిస్తున్న అర్చకులు

వెల్గటూర్: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వరస్వామిని జగిత్యాల జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత శనివారం దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా దర్శనానికి విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఆలయ అర్చకులు సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సతీమణి రాధిక, వారి కుటుంబసభ్యులు, ఆలయ అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ



టీవీ బహూకరిస్తున్న దాతలు

ధర్మపురి: మండలంలోని కమలాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు ధర్మపురికి చెందిన ఎన్‌ఆర్‌ఐ అప్పాల ప్రమోద్ దంపతులు శనివారం తమ కుమారుడు మహేశ్ జన్మదినం సందర్భంగా 25 వేల రూ.లవిలువ గల టీవీని బహూకరించారు. ఈ సందర్భంగా దంపతులకు పాఠశాల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి జాతర



హోమపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని వేంకటేశ్వర స్వామి (అమ్మ తాలయం) జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఉదయమే ఆలయం వద్ద హోమపూజను నిర్వహించి జాతర ఉత్సవాలను ప్రారంభించారు. భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం ఆలయకమిటీ సభ్యులు పులిహోరను అందజేశారు.

చిత్ర కథ: కొనుగోలు కేంద్రాల్లో కోతుల హంగామా



సారంగాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతులతో రైతులు హైరానా పడుతున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ధాన్యం కుప్పల మీదికి వందల కొద్ది కోతులు వచ్చి ధాన్యం తింటున్నాయి. ధాన్యం తినడంతో పాటు, ధాన్యం ఆరబోసిన టార్పాలిన్ కవర్లను చించి వేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం శుభ్రం చేసుకోనివ్వకుండా మీది మీదికి వస్తుండడంతో భయపడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

సమాచారం..

ప్రెస్‌క్లబ్ జేఏసీ కార్యవర్గం ఎన్నిక



రవియాదవ్



జగదీశ్వర్

రాయికల్: మండల జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) అధ్యక్షుడిగా వాసం రవియాదవ్, ఉపాధ్యక్షులుగా చింతకుంట సాయికుమార్, నాగిరెడ్డి రఘుపతి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, సంయుక్త కార్యదర్శిగా గంగధరి సురేశ్, కోశాధికారిగా మచ్చ శంకర్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎద్దండి ముత్యం రాజిరెడ్డి, గౌరవ సలహాదారులుగా సింగిడి శంకర్, రసూల్, నిజ నిర్ధారణ కమిటీ సభ్యులుగా నాగమల్ల శ్రీకర్, పటేల్ నరేందర్‌రెడ్డి, ఎండీ.ముజాఫర్, గుర్రాల వేణు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన నియామకం



జంగిలి విజయ్

కోరుట్ల: పట్టణ బీఆర్ఎస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా జంగిలి విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్ శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన బీఆర్ఎస్ నాయకులకు విజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

చిన్నగ్రామాల్లో అత్యధిక పోలింగ్



ఓటేయడానికి లైన్లలో ఉన్న మహిళలు(ఫైల్)

మల్యాల: మండలంలోని 19 గ్రామాల్లో మొత్తం 38,667 మంది ఓటర్లలో 18,544 మంది పురుషులు, 20,320మంది మహిళలు ఉండగా, మొత్తం ఓటర్లలో 77.67 శాతం మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. వీరిలో పురుషులు 70.79 శాతం ఓటు హక్కును వినియోగించుకోగా, మహిళలు 81.92 శాతం వినియోగించుకున్నారు. అతి తక్కువ పోలింగ్ మల్యాల మండల కేంద్రంలోని 304పోలింగ్‌స్టేషన్‌లో నమోదైంది. 735 మంది ఓటర్లకు గాను కేవలం 507 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 68.98శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా గొర్రెగుండంలోని 319 పోలింగ్ స్టేషన్‌లో 88.45శాతం నమోదైంది. రాజారంలోని 283 బూత్‌లో 83.26శాతం, నూకపల్లి 313పోలింగ్ స్టేషన్‌లో 83.85శాతం, 314 బూత్‌లో 83.13శాతం, ఒబులాపూర్‌లోని పోలింగ్ స్టేషన్లు 317, 318లలో వరుసగా80.57శాతం, 83.05శాతం, గుడిపేటలో 80.92శాతం తక్కళ్లపల్లిలోని 209 బూత్‌లో 80.42శాతం, ముత్యంపేటలోని 321లో 81.98శాతం, 322లో 82.34శాతం, బల్వంతాపూర్‌లోని 326లో 80.44 శాతం, 327లో 80.21శాతం నమోదైంది.

శబరిమలై అయ్యప్ప దర్శనానికి ఆర్టీసీ సౌకర్యం



బుకింగ్ ఇస్తున్న ఆర్టీసీ అధికారులు

కోరుట్ల: అయ్యప్ప భక్తులు శబరిమలై అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు కోరుట్ల ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయ మాధురి తెలిపారు. ఈ మేరకు శనివారం శబరిమల భక్తుల కోసం 36 సీట్లు గల సూపర్ లగ్జరీ బస్సును అయ్యప్ప స్వాముల కోసం బుకింగ్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జీ సింగ్, రమేష్, ఆడెపు శంకర్, రాచకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.